


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjun saamaacharam.com | ఆదివారం 19, జులై 2026 | సంపుటి :1 సంచిక : 196 | పేజీలు : 8 , వెల.2.00



## భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర..

# 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్( రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లైంది. వాస్తవానికి నేడు ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది.

వార్త 2లో

## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా

# తెలంగాణ: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,

**భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు.**

శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు.దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.



## చరిత్ర సృష్టించిన విక్రమ్-1..

# స్కైరూట్ బృందాన్ని ప్రశంసించిన ప్రధాని

భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు.

## బండి సంజయ్, ఈటల

# మధ్య కుదిరిన సయోధ్య



2

తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు.వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు.



2

## సీజేపీ వ్యవస్థాపకుడు

# అభిజీత్ దీప్కేపై దాడి.. సిరా లాంటి ద్రవం చల్లిన మహిళ..

**కాక్రోచ్ జనతా పార్టీ (జజీపా) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా లాంటి ద్రవంతో ఓ మహిళ దాడి చేసింది. జంతర్ మంతర్ వద్ద దీప్కే తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి ప్రసంగిస్తుండగా ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని మహిళ వారి సమావేశంలోకి ప్రవేశించి అతనిపై దాడికి పాల్పడింది.**

## ఆయిల్ పామ్ రైతుల కోసం

# దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలి

హైదరాబాద్,

కేంద్రంపై సంయుక్త ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు.దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు. దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.



2




## ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో

# అరుదైన రికార్డు.. టికెట్ ధర రూ. 27 లక్షలు!

2



## ఇప్పటిదాకా ఒక లెక్క..

# ఇక నుంచి మరో లెక్క..

కాంగ్రెస్ మోసం చేసిన చోటే యువ సంగ్రామ సదస్సును ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈరోజు(శనివారం) సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

## బిజెపి పార్టీ బలోపేతం పై

# దృష్టి సారించాలి: ఎంపి లక్ష్మణ్

2

ప్రజలకు కాంగ్రెస్ పై కోపం ఉందని, బిఆర్ఎస్ పై నమ్మకం లేదని బిజెపి ఎంపి లక్ష్మణ్ తెలిపారు. బిజెపిలో కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్టానం దృష్టి పెట్టిందని అన్నారు.



అర్జున్ సమాచారమ్

# భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర..

# 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం



ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్( రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లైంది. వాస్తవానికి నేడు ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్(రాజూ)లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన విక్రమ్-1.. స్కైరూట్ బృందాన్ని ప్రశంసించిన ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు మోదీ. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ తొలి కక్ష్య ప్రయోగంలో గ్రహా స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థల సాంకేతిక పేలోడ్‌లు సహా స్కైరూట్ రూపొందించిన స్కోప్ ప్లాట్‌ఫామ్‌నూ పరీక్షించారు. అలాగే 'కాస్మిక్ బ్లూమ్' పేరిట ల్యాబ్‌లో తయారైన వజ్రం, భారత శాస్త్రవేత్తలకు అంకితమైన సూక్ష్మ కళాఖండం, రాకెట్ నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల సంతకాలతో కూడిన ప్రత్యేక పేలోడ్‌లనూ కక్ష్యలోకి పంపారు.

## ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో అరుదైన రికార్డు.. టికెట్ ధర రూ. 27 లక్షలు!

స్పోర్ట్స్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఫిఫా ప్రపంచ కప్ 2026 టోర్నీ తుది దశకు చేరుకుంది. రేపు(ఆదివారం)స్పెయిన్, అర్జెంటీనా మధ్య తుది పోరు జరగనుంది. న్యూయార్క్‌లోని ప్రముఖ 'మెట్‌లైఫ్ స్టేడియం' వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌ను చూసేందుకు ఫుట్ బాల్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరికొన్ని గంటల్లో విజేత ఎవరో తేలనుంది. ఇది ఇలా ఉంటే.. ఇప్పటికే పలు రికార్డులు సృష్టించిన ఫిఫా ప్రపంచ కప్ 2026 మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ ధర ఏకంగా రూ.27 లక్షలు పలికింది. ఇది ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలోనే అత్యధిక ధర కావడం విశేషం. ఓ స్పోర్ట్స్ మీడియా నివేదిక ప్రకారం.. ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన అత్యున్నత శ్రేణి (హాస్పిటాలిటీ) టికెట్ ధర ఏకంగా రూ. 27 లక్షలు పలుకుతోంది. ఈ ప్రీమియం హాస్పిటాలిటీ ప్యాకేజీలు కేవలం మ్యాచ్ వీక్షణకే పరిమితం కావు. విదేశీ వీఐపీలు, కార్పొరేట్ దిగ్గజాలను ఆకర్షించేలా స్టేడియంలో ప్రత్యేక విలాసవంతమైన లాంజ్‌లు, ఫైన్ డైనింగ్, విభిన్న లగ్జరీ సేవలను ఫిఫా అందిస్తోంది. అయితే, ఇది కేవలం వీఐపీ ప్యాకేజీ ధర మాత్రమేనని, సామాన్య అభిమానుల కోసం అందుబాటులో ఉండే సాధారణ మ్యాచ్ టికెట్ల ధరలు దీనికంటే చాలా తక్కువగా ఉంటాయని నిర్వాహకులు స్పష్టం చేశారు. అమెరికా క్రీడా చరిత్రలో ఇప్పటివరకు అత్యంత ఖరీదైన ఈవెంట్‌గా 2024 లో జరిగిన 'సూపర్ బౌల్' (శాన్ ఫ్రాన్సిస్కో 49వతీం వర్సెస్ కాన్సాస్ సిటీ చీఫ్స్) నిలిచింది. అప్పట్లో దీని సగటు టికెట్ ధర రూ. 9.6 లక్షలుగా నమోదైంది. ఇప్పుడు ఫిఫా ఫైనల్ టికెట్ ధర ఆ రికార్డును దాదాపు మూడు రెట్లు అధిగమించి సరికొత్త సంచలనం సృష్టించింది. ఇదే సమయంలో ఈ ఫైనల్ మ్యాచ్ లీస్ట్ టికెట్ ధర 6,943 డాలర్లు(సుమారు రూ.6 లక్షలు)గా ఉంది. ఈ భారీ ధరలపై క్రీడా అభిమానుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత చౌకైన సాధారణ టికెట్ల ధరలు కూడా సాధారణ ప్రజల బడ్జెట్‌కు మించిపోతున్నాయి. దీంతో అంతర్జాతీయంగా జరిగే క్రీడా ఈవెంట్లు సామాన్యుడికి అందని ద్రాక్షగా మారనున్నాయనే చర్చ మొదలైంది. కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగి, నిజమైన క్రీడాభిమానులు స్టేడియాలకు దూరం కావలసి వస్తోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బండి సంజయ్, ఈటల మధ్య కుదిరిన సయోధ్య

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

: తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క..

### రేవంత్‌కు కేటీఆర్ వార్నింగ్

సరూర్‌నగర్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాంగ్రెస్ మోసం చేసిన చోటే యువ సంగ్రామ సదస్సును ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈరోజు(శనివారం) సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇప్పటిదాకా ఒక లెక్క, ఇక నుంచి మరో లెక్క అంటూ సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. నెత్తురుడికిన యువత జంగ్ సైరన్ మోగిస్తోందన్నారు. యువత కదం తొక్కితే ఉద్యమాలు ఉప్పెనలయ్యాయని గుర్తు చేశారు. రేపటి తెలంగాణ నిర్మాతలు ఈ యువతే అని చెప్పుకొచ్చారు. మోసం చేసిన వారికి బుద్ధి చెప్పడానికే సమావేశం పెట్టినట్లు తెలిపారు. సరూర్‌నగర్ స్టేడియం సాక్షిగా యువతను కాంగ్రెస్ దగా చేసిందని విమర్శించారు. ఢిల్లీ నుంచి గాంధీలు వస్తే, గల్లీ నుంచి కల్తీ కాంగ్రెస్ వాళ్లు వచ్చారని మాజీ మంత్రి వ్యాఖ్యానించారు. యూత్ డిక్లరేషన్ పేరిట యువతను నయవంచనకు గురిచేశారని కేటీఆర్ మండిపడ్డారు. పాత కేటుగాళ్లు, కొత్త డూప్లికేట్ గాళ్లు కలిసి నకిలీ డిక్లరేషన్లు ఇచ్చారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి నిరుద్యోగ యువత మోసపోతోందన్నారు. యువతను నమ్మించి నట్టేట ముంచింది కాంగ్రెస్ అంటూ విరుచుకుపడ్డారు. తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలంటూ మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణలో నోటిఫికేషన్లు లేవని.. లూటిఫికేషన్లు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. అశోక్‌నగర్‌లో రాహుల్‌గాంధీ అబద్ధపు మాటలు చెప్పారని ఆరోపించారు. రాహుల్‌కు తెలుగు రాదని, తెలంగాణ ప్రజల బాధలు అర్థం కావన్నారు. కొలువుల కుంభమేళా అని.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మాజీ మంత్రి ఆరోపించారు. కొలువులు అడిగితే యువతను పోలీసుల చేత కొట్టిస్తున్నారని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ అంటూ అవినీతి సొమ్ముతో ప్రకటనలిచ్చారని.. ఇప్పుడు జాబుల్లేవని.. ప్రభుత్వం నుంచి ఉలుకులేదు, పలుకులేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ జాబులు నింపకుండా, రాహుల్ జేబులు నింపుతున్నారని ఆరోపించారు. అన్నదమ్ముల అల్మరాలను రేవంత్ నింపుతున్నారంటూ వ్యాఖ్యానించారు. హామీలపై ప్రజలు ప్రశ్నిస్తే అవహేళనగా మాట్లాడారని.. అవమానాలు, అవహేళనలను ప్రజలు, యువత ఎప్పటికీ మర్చిపోరన్నారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగ పత్రాలిచ్చి.. రేవంత్‌రెడ్డి క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలపై సీఎం, మంత్రులు పూటకోమాట మాట్లాడుతున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. భూములు, బూడిద, ఇసుక దోపిడీ జరుగుతోందని.. బ్రదర్స్, బామ్మర్ది లూటిఫికేషన్ రాష్ట్రంలో జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. 'కాంగ్రెస్‌కు ఘోరీ కడతామని యువత ఒట్టు పెట్టుకుంటున్నారు. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది రేవంత్ గుర్తుపెట్టుకో. మా హయాంలో కొన్ని పొరపాట్లు జరిగాయి.. అవన్నీ సరిచేసుకుంటాం. మా హయాంలో 2.32 లక్షల మందికి ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇచ్చాం.. 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం' అని చెప్పుకొచ్చారు. 70 వేల ఉద్యోగాలిచ్చినట్టు నోటిఫికేషన్లు చూపిస్తే.. శాశ్వతంగా రాజకీయాలను వదిలేస్తానంటూ రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.



## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి.. సిరా లాంటి ద్రవం చల్లిన మహిళ..

ఢిల్లీ: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాక్రోచ్ జనతా పార్టీ (జజీపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా లాంటి ద్రవంతో ఓ మహిళ దాడి చేసింది. జంతర్ మంతర్ వద్ద దీప్కే తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి ప్రసంగిస్తుండగా ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని మహిళ వారి సమావేశంలోకి ప్రవేశించి అతనిపై దాడికి పాల్పడింది. దీంతో దీప్కే మద్దతుదారులు మహిళ వైపు ఒక్కసారిగా దూసుకెళ్లడంతో జంతర్ మంతర్ వద్ద కాసేపు గందరగోళం నెలకొంది. అయితే, మహిళ ఎవరు? దాడి వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం తర్వాత తాను కూడా నిరశనకు దిగుతానని దీప్కే ప్రకటించిన కాసేపటికే అతనిపై ఈ దాడి జరిగింది. ఘటన అనంతరం ఎక్స్ వేదికగా దీప్కే స్పందించారు. దాడికి సంబంధించిన వీడియోను పోస్టు చేస్తూ 'నీలం నా రంగు... జై భీమ్!' అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ రోజు (శనివారం) సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. 21వ రోజుకు చేరుకున్న నిరశన దీక్షను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల ప్రశ్నపత్రాల లీక్ ఘటనలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ ఆధ్వర్యంలో వాంగ్‌చుక్ నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జూన్ 28 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడంతో ఆయన దాదాపు 9.5 కిలోల బరువు తగ్గారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి దీక్షను భగ్నం చేశారు. ఈ ఘటన అనంతరం గంటల వ్యవధిలోనే అభిజీత్ దీప్కేపై మహిళ దాడి చేసింది.

## బిజెపి పార్టీ బలోపేతం పై దృష్టి సారించాలి: ఎంపి లక్ష్మణ్

హైదరాబాద్:

ప్రజలకు కాంగ్రెస్ పై కోపం ఉందని, బిఆర్ఎస్ పై నమ్మకం లేదని బిజెపి ఎంపి లక్ష్మణ్ తెలిపారు. బిజెపిలో కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్టానం దృష్టి పెట్టిందని అన్నారు. ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇరువురి నేతలతో గంటపాటు సమావేశం అయ్యారు. కేంద్రమంత్రి బండిసంజయ్, ఈటల రాజేందర్ తో అభయ్ పాటిల్ సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం పై దృష్టి సారించాలని బండిసంజయ్, ఈటల రాజేందర్ కు లక్ష్మణ్ సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రావడంపై చర్చించామని, వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్ సభ సీట్లు పెరుగుతాయని అన్నారు. బిజెపిని అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని ఎంపి లక్ష్మణ్ తెలియజేశారు.



అరుణ్ సమాచారమ్

# బిల్లుల పాస్ కోసం బిజెపి వ్యూహం

## విపక్ష పార్టీలను బుట్టలో వేసుకునే యత్నం

## ఈసారి రాజ్యాంగ సవరణ వీగిపోతే బిజెపి పరవు పోయినట్లే

**న్యూఢిల్లీ,**

గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోవడంతో బిజెపి మరింత పట్టుదలగా అడుగులు వేస్తోంది. బిల్లులు ఆమోదింపచేసుకోవడానికి ఇదే సమయమని కమలనాథులు భావిస్తున్నారు. అయితే చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించేందుకు మాత్రం ఆ పార్టీ ముందుకు రావడం లేదు. గత సెషన్‌లో బిజెపి వ్యూహాత్మకంగా ఉందని అంతా భావించారు. కానీ ఓటింగ్ సమయంలో దానికి వ్యూహం లేదని తేలిపోయింది. ప్రతిపక్ష పార్టీలే ఓ రకంగా వ్యూహాత్మకంగా నిలిచి తమ పట్టును నిలబెట్టుకున్నాయి. దీంతో రాజ్యాంగ సవరణ బిల్లులు బలం లేకపోవడంతో వీగిపో యాయి. ఇప్పుడు మరోమారు ప్రయత్నంలో బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో లోక్‌సభ సీట్లను 2011 జనాభా లెక్కల ఆధారంగానే పెంచడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నెగ్గించుకోవాలన్న పట్టుదలతో భాజపా నాయకత్వం



పనిచేస్తోంది. 2/3వ వంతు ఆధిక్యం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు వీగిపోవడం అధికారపక్షానికి ఇబ్బందికరంగా పరిణమించింది. తర్వాత ప్రతిపక్షం దూకుడు మొదలుపెట్టింది. ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తృణమూల్‌కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది వేరుకుంపటి పెట్టుకొని అధికారపక్షానికి మద్దతు పలికారు. ఇండియా కూటమితో డీఎంకే తెగదెంపులు చేసుకుంది. ఈ రెండు అవకాశాలను అనుకూలంగా మలచుకునే పనిలో భాజపా నాయకత్వం తలమునకలైంది. ఇదివరకు డీలిమిటేషన్ బిల్లులో సీట్లపెంపు ప్రతిపాదన ఉన్నా దానికి ప్రాతిపదికను పెట్టలేదు. ఈసారి అలాకాకుండా.. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్లను 50శాతం మేర పెంచుతామని, దానివల్ల లోక్‌సభలో ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుందని భరోసా ఇవ్వడానికి బిజెపి సమాయత్తమైంది. ఈ మార్పునకు ఇప్పటికే ఇండియా కూటమిలోని శరద్‌పవార్ పార్టీ ఆకర్షితమైంది. 50శాతం సీట్లు పెంచేలా బిల్లులో స్పష్టత ఇస్తే మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదని ప్రకటించింది. డీఎంకే కూడా వ్యతిరేకించకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భాజపా నాయకత్వం ఈ అంశంపై అన్ని పార్టీలతో తెరవెనుక మంత్రాంగం నెరపుతోంది. ప్రధానంగా డిఎంకె, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపిలను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. తృణమూల్ చీలిపోవడం, మరోపార్టీ ఇండియా కూటమికి దూరంగా ఉండటంతో తమకు ఇంతకంటే మంచి తరుణం రాదని భావించి.. మిగిలిన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను కమలనాథులు ముమ్మరం చేశారు. ఇప్పటికే భాజపా అత్యున్నత నాయకత్వం ప్రధానమంత్రి నివాసంలో దీనిపై చర్చించి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 సీట్లున్నాయి. తృణమూల్ నుంచి విడిపోయిన 20 మంది, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన నుంచి బయటపడిన ఆరుగురు ఎంపీలను కలిపితే ఆ సంఖ్య 319కి చేరనుంది. శరద్‌పవార్ పార్టీకి చెందిన 8 మంది మద్దతు లభిస్తే 327కి, డీఎంకే అండగా నిలిస్తే ఈ సంఖ్య 349కి చేరుతుంది. 2/3వ వంతు బలమైన 360ని చేరుకోవడానికి మరో 11మంది అవసరమవుతారు. వైకాపాకు చెందిన నలుగురు, ఒక స్వతంత్ర సభ్యుడు మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారు. అంటే ఇంకా ఆరుగురు తక్కువవుతారు. ఒకవేళ డీఎంకే గైర్హాజరైతే సభ సంఖ్యాబలం 518కి తగ్గుతుంది. అప్పుడు హాజరైనవారిలో 346 మంది మద్దతిస్తే చాలు. సభలోని 540 మంది హాజరైతేనే మెజార్టీకి 360 మంది అవసరం అవుతారు. మొత్తంగా బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేకపోతే బెడిసి కొడుతుందా అన్నది చూడాలి.

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

## రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు

## సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం

## కూటమి వచ్చాక రుణాల రీ-షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా

## నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి

**నరసరావుపేట,**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా



మారుస్తాం." అని సీఎం వివరించారు. "మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారు దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేతయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఆఅఅః) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు

# కొల్లేరులో కాలుష్యంపై సుప్రీంకోర్టు కమిటీ ఆగ్రహం

**ఏలూరు,**

కొల్లేరులో కాలుష్యం పెరగడంపై సుప్రీంకోర్టు కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. కొల్లేరు లేక్ ప్రొటెక్షన్ కేసులో కలెక్టర్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్రమ చేపల చెరువుల ధ్వంసానికి అటవీశాఖకు సహకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. స్థానిక యంత్రాంగం సహకరించడం లేదని, కూల్చివేతలకు అడ్డు తగులుతున్నారని అటవీ పర్యావరణశాఖ.. కమిటీకి ఫిర్యాదు చేసింది. తక్షణమే రంగంలోకి దిగాలని ఏలూరు జిల్లా కలెక్టర్‌ను ఈ మేరకు కేంద్ర సాధికార కమిటీ ఆదేశించింది. మరోవైపు పక్షుల మనుగడ ప్రమాదంలో పడటంపై పిటిషనర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో కొల్లేరు సరస్సు కలుషితంపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని కమిటీ ఆదేశించింది. అక్రమ చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కూల్చివేతల పురోగతితో పాటు కాలుష్య నివారణ చర్యలపై నివేదిక సమర్పించాలని పేర్కొంది.

# మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీరు

**హైదరాబాద్,**

హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మల్లన్నసాగర్ జలాశయం నుంచి రోజుకు అదనంగా 25,30 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీలు) నీటిని తరలించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయించింది. సింగూర్, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు మళ్లించేందుకు సుమారు 4 కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ పనులను 50 నుంచి 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశిరచారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగినా నగరంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ జల వనరులను వినియోగించేందుకు జలమండలి కార్యాచరణ చేపట్టింది. అలాగే నగరానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రోజువారీ అవసరాలు, భవిష్యత్ డిమాండ్‌పై సమగ్ర అంచనా వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## పిల్లలను బావిలోకి తోసి తల్లి ఆత్మహత్య

**రంగారెడ్డి,**

రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లిలో ఇద్దరు పిల్లలను బావిలో తోసి, తల్లి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వసంత (35), సుధాకర్ దంపతులు కొత్తపల్లికి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు పిల్లలు. కూతురు (15), కొడుకు (10) ఉన్నారు.

# ప్రేమించిన ప్రియుడి మోసం

## మరో పెళ్లికి సిద్ధం పడడంతో యువతి ఆత్మహత్య

## యువకుడి ఇంటిముందు శవంతో బంధువుల ధర్నా

**ఒంగోలు,**

ఎనిమిదేళ్లుగా ప్రేమించిన యవకుడు మోసం చేయడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తట్టుకోలేకపోయింది. తనను కాదని వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో బాధిత కుటుంబసభ్యులు ప్రియుడు ఇంటి ముందు ఆందోళనకు దిగారు. మృతురాలి మెడలో తాళికట్టి న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. ఏపీలోని ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం పొందురులో ఈ ఘటన చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు గ్రామానికి చెందిన అడ్డగళ్ల కీర్తి (24) ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఖతార్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పొందూరుకు చెందిన పాపినేని సాయి అనే యువకుడితో 8 ఏళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారడంతో పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నారు. అయితే వారం కిందట సాయికి అతని కుటుంబసభ్యులు వేరే అమ్మాయితో పెళ్లి నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన కీర్తి ముంబై నుంచి నాలుగు రోజుల కిందట ఒంగోలు వచ్చి సాయి తల్లిదండ్రులను కలిసింది. సాయితో వివాహం చేయాలని కోరింది. అయితే అందుకు సాయి కుటుంబసభ్యులు నిరాకరించారు. అంతేకాకుండా బెదిరింపులకు దిగారు. దీంతో సాయిని మరిచిపోవాలని ఆమె తల్లిదండ్రులు నచ్చజెప్పారు. అనంతరం కీర్తి ముంబైకి వెళ్లిపోయింది. ప్రియుడు చేసిన మోసాన్ని తట్టుకోలేక ఈ నెల 14వ తేదీన ముంబైలో ఉరేసుకుంది. ఈ ఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కీర్తి కుటుంబసభ్యులకు గురువారం అప్పగించారు. కీర్తి సూసైడ్‌తో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె కుటుంబసభ్యులు, బంధువులు పొందూరులోని సాయి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. కీర్తి మృతదేహాన్ని ఇంటి వరండాలో ఉంచి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. సాయి చేత మృతురాలి మెడలో తాళి కట్టించి, అంత్యక్రియలు నిర్వహించాలని పట్టుబట్టారు. ఆ సమయంలో సాయి ఇంట్లో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న టంగుటూరు పోలీసులు వచ్చి దీనిపై సాయి బంధువులు, కీర్తి బంధువులతో చర్చించారు. అనంతరం సాయి బంధువులు కలగజేసుకుని తమ సంప్రదాయం ప్రకారం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, కీర్తి ఆత్మహత్య గురించి తెలుసుకుని సాయి ఖతార్‌కు వెళ్లిపోయాడని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది.

# జైషే మహ్మద్ టెర్రర్ మాడ్యూల్ ఛేదన

**గాంధీనగర్,**

ఉగ్రవాద అణచివేత చర్యల్లో భాగంగా గుజరాత్ పోలీసులు జైషే మహమ్మద్ టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించారు. పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న ఐదుగురిని అరెస్టు చేశారు. బిలాల్ అబిద్ షేరా, మహమ్మద్ అయూబ్ కడివాల్, మహమ్మద్ షఫీ ముఖి, మహమ్మద్ హసన్ కరాడియా, మహమ్మద్ సునాసరగా వారిని గుర్తించారు. న్యాయస్థానం వీరికి జులై 24 వరకు పోలీసు కస్టడీ విధించింది. ఇటీవల ఎనిమిది మంది జైషే అనుమానితులను గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అరెస్టు చేశారు. దేశంలో ఉగ్రకార్యకలాపాలు నిర్వహంచేందుకు ఒక నెట్‌వర్క్ కోసం వారు యత్నిస్తున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నప్పుడే ఈ ఐదుగురి పేర్లు బయటకు వచ్చాయి.

# ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్దరణ

## పనులను ప్రారంభించిన చంద్రబాబు

## గత వైసిపి బ్యారేజీని నిర్లక్ష్యం చేసిందని విమర్శ

**రాజమహేంద్రవరం,**

మూడు జిల్లాల పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సోమవారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను చంద్రబాబు ప్రారంభించారు. పునరుద్ధరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 2014-19 మధ్య కాలంలో ధవళేశ్వరం బ్యారేజీకి 58 కొత్త గేట్లను అప్పటి తెదేపా ప్రభుత్వం అమర్చింది. ఇప్పుడు సీడబ్ల్యూసీ సూచనల మేరకు మిగిలిన 117 గేట్లకు కొత్త గేట్లను అమర్చే పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో సీఎం మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెల నాటికి కొత్త గేట్ల బిగింపు పక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. బ్యారేజీని గొడ్డలి పార్టీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాటన్ బ్యారేజీ గేట్లను మార్చలేదని.. కొట్టుకుపోయినా పట్టించుకోలేదంటూ వైసీపీపై మండిపడ్డారు. గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్లను పునరుద్ధరణ చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టులో 72 శాతం పనులను పూర్తి చేశామని.. టీడీపీ అధికారంలో ఉండి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని సీఎం తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయన్నారు. పుష్కరాలకు ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. రెండేళ్లలో సాగునీటి కోసం రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని.. తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేశామని చెప్పుకొచ్చారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో డబ్బులు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అభిమానులు ఎక్కువని అన్నారు. పవన్ భుజానికి శస్త్ర చికిత్స జరిగిందని.. ముంబై వెళ్లి ఆయనను పరామర్శించినట్లు తెలిపారు. ఆరోగ్యం కుదుటపడ్డాకే విధుల్లోకి రావాలని పవన్‌కు చెప్పానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# వియత్నాం నుంచి ముగ్గురి డెడ్ బాడీల రాక

**అమరావతి,**

వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలు మంగళవారం ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్‌కు చేరుకున్నాయి. మృతుల్లో కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ఉన్నారు. మృతదేహాలను భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చట్టపరమైన పక్రియలను ముంబైలో పూర్తి చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అధికారులు నేరుగా అప్పగించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులకు, సన్నిహితులకు ధైర్యం చెప్పారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## ఎల్‌నినో.. రైతాంగానికి ముప్పు

ప్రకృతి సంకేతాలను పసిగట్టి వ్యవసాయ విధానాలను మార్చుకోకపోతే తీవ్ర నష్టం తప్పదు. వ్యవసాయం ప్రకృతిపై ఆధారపడిన జీవన విధానం. వర్షం కురిస్తే పంట పండుతుంది, వర్షం దూరమైతే రైతు జీవితమే అనిశ్చితిలో పడుతుంది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్రరూపం దాల్చుతున్నాయి. వాటిలో అత్యంత ప్రభావవంతమైన ప్రకృతి దృగ్విషయాల్లో ఒకటి ఎల్‌నినో. ఇది వేల కి.మీ దూరంలోని పసిఫిక్ మహాసముద్రంలో ప్రారంభమైనప్పటికీ, దాని ప్రభావం భారతదేశంలోని పొలాల వరకు చేరుతుంది. ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో దీని ప్రభావం రైతుల ఆర్థిక, సామాజిక జీవితాలను తీవ్రంగా కుదిపేస్తుంది. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న కోట్లాది కుటుంబాలకు ఎల్‌నినో కేవలం వాతావరణ శాస్త్ర పదం కాదు, అది ఆశలను పరీక్షించే పరిస్థితి. విత్తనాలు నేలలో పడిన తర్వాత ఆకాశం వైపు ఎదురు చూసే రైతుకు ప్రతి మేఘం ఆశ, ప్రతి ఎండిన రోజు ఆందోళన. అలాంటి సమయంలో వర్షాలు ఆలస్యం కావడం, తక్కువగా కురవడం లేదా అసమానంగా పడటం రైతును సంక్షోభంలోకి నెడుతుంది. దేశంలోని సాగుభూమిలో గణనీయమైన భాగం వర్షాధారమే. అందువల్ల రుతుపవనాలు బలహీనపడిన ప్రతి సందర్భంలో పంటల సాగు, దిగుబడులు, గ్రామీణ ఉపాధి, ఆహార భద్రత, ధరలు వంటి అనేక అంశాలు ప్రభావితమవుతాయి. ఎల్‌నినో ప్రభావం మొదట కనిపించేది వర్షాల అస్థిరతలోనే.

సాధారణంగా జూన్‌లో మొదలయ్యే వర్షాలు ఆలస్యమవడం, కొద్ది రోజుల్లో భారీగా కురిసి మళ్లీ ఎక్కువకాలం విరామం ఇవ్వడం వంటి పరిస్థితులు రైతుల ప్రణాళికలను దెబ్బతీస్తాయి. ఒకసారి విత్తనాలు వేసిన తర్వాత తేమ లేకపోతే అవి మొలకెత్తవు. మొలకెత్తినా ఎండలకు తట్టుకోలేక ఎండిపోతాయి. దీంతో రైతు మళ్లీ విత్తనాలు కొనాల్సి వస్తుంది. పెట్టుబడి రెండింతలు అవుతుంది. సోయాబీన్ వంటి పంటలు వర్షాలపై ఆధారపడుతాయి. వర్షాభావంవల్ల సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా తగ్గుతాయి. సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో కూడా చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతుంది. బోర్లుఎండిపోవడం, విద్యుత్ వినియోగం పెరగడం, సాగు ఖర్చులు అధికమవడం రైతుల లాభాలను తగ్గిస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావం కేవలం పంటలకే పరిమితం కాదు. పశుసంవర్ధక రంగం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. పచ్చిమేత కొరత, తాగునీటి సమస్య, పాల ఉత్పత్తి తగ్గుదల గ్రామీణ కుటుంబాల ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. వ్యవసాయ కూలీలకు పనిదినాలు తగ్గిపోతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం మందగిస్తుంది. ఈ పరిస్థితుల్లో రైతుల ముందున్న అతిపెద్ద సవాలు అనిశ్చితి. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియదు. ఏ పంట వేయాలో స్పష్టత ఉండదు. పెట్టుబడి పెడితే తిరిగి వస్తుందా అనే సందేహం వెంటాడుతుంది. సన్నకారు రైతులకు ఇది మరింత భారంగా మారుతుంది. పంట విఫలమైతే అప్పు తీర్చలేని పరిస్థితి, వడ్డీ భారం, కుటుంబ ఆర్థిక సంక్షోభం తప్పదు. అయితే ప్రతి ఎల్‌నినో సంవత్సరంలో ఒకేవిధమైన ప్రభావం ఉంటుందని భావించడం కూడా సరైంది కాదు. కొన్ని ప్రాంతాల్లో తక్కువ ప్రభావం ఉండవచ్చు, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావం కనిపించవచ్చు. అందుకే జిల్లా, మండల స్థాయి వాతావరణ అంచనాల ఆధారంగా రైతులకు సకాలంలో సలహాలు అందించడం అత్యంత అవసరం. వ్యవసాయ శాఖ పాత్ర ఇక్కడ కీలకంగా మారుతుంది. ఏ ప్రాంతంలో ఏ పంట వేయాలి? ఏ రకమైన విత్తనాలు అనుకూలం? తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు ఏమిటి? అనే విషయాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి. శాస్త్రవేత్తల సూచనలు రైతులకు సులభంగా చేరేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. చిన్న ఉద్యోగాలకు నైపుణ్యమే దన్ను నీటి నిర్వహణ కూడా ఇప్పుడు అత్యవసర అంశంగా మారింది.

# ఎల్ నినో ఎఫెక్ట్... పెరిగిన కరెంట్ బిల్లు....

## గృహజ్యోతి నుంచి 4 లక్షల మంది ఔట్

హైదరాబాద్, జులై 18, (అర్జున్ సమాచారం ప్రతినిధి )

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేద కుటుంబాలకు గృహ్యజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో చాలా మంది జీరో కరెంటు బిల్లు వస్తోంది. అయితే వేసవిలో కొందరు కూలర్లు, ఏసీలు వాడడంతో 200 యూనిట్లు దాటి బిల్లు చెల్లిస్తున్నారు. వర్షాకాలం రాగానే మళ్లీ జీరో బిల్లుతో లబ్ధి పొందుతున్నారు. అయితే ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదు. దీంతో రైతులు ఇప్పటికే ఇబ్బంది పడుతున్నారు. తాజాగా దీని ప్రభావం గృహజ్యోతి లబ్ధిదారులపైనా పడింది. వాతావరణ వ్యత్యాసాలతో గృహజ్యోతి లబ్ధిదారులు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కూడా అసాధారణ ఎండలు, ఉక్కపోత కారణంగా గృహ విద్యుత్ వినియోగం పెరగడంతో అనేక మంది లబ్ధిదారులు అర్హత కోల్పోతున్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్)పరిధిలోనే సుమారు నాలుగు లక్షల మంది లబ్ధిదారులు పథకంతో లబ్ధి పొందలేకపోయారు. మొత్తం 26.54 లక్షల మంది నమోదైన వారిలో కేవలం 22.59 లక్షల మందికి మాత్రమే జీరో బిల్లు వచ్చింది. ఇతర విద్యుత్ సర్కిళ్లలో కూడా అనర్హుల సంఖ్య భారీగా ఉందని సమాచారం. సాధారణంగా వర్షాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గి, విద్యుత్ వినియోగం తగ్గుతుందని అంచనా. కానీ ఎల్‌నినో ప్రభావంతో ఈ సమతుల్యత దెబ్బతింటోంది. అధిక ఎండలు, ఉక్కపోత కారణంగా ఫ్యాన్లు, ఏసీలు ఎక్కువగా వాడటం వల్ల చాలా గహాల్లో విద్యుత్ వినియోగం 200 యూనిట్ల పరిమితిని అధిగమించింది. ఇది పథకం రూపొందించిన సమయంలో ఊహించని వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడిన సవాలు. పథకం నుంచి బయటకు వచ్చిన వారికి నెలవారీ విద్యుత్ బిల్లులు వస్తాయి. తక్కువ ఆదాయ కుటుంబాలకు ఇది అదనపు ఆర్థిక భారం. జూన్ నెలలోనే లక్షలాది మంది ఈ షాక్‌ను ఎదుర్కొన్నారు. జూలై నెలలో కూడా ఇలాంటి పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనాలు. దీంతో పథకం యొక్క ప్రయోజనం తగ్గిపోతూ, లబ్ధిదారుల విశ్వాసం కూడా ప్రభావితం అవుతుంది. ఈ పరిణామం కేవలం ఒక పథకానికి మాత్రమే పరిమితం కాదు. వాతావరణ మార్పులు ఇతర సంక్షేమ కార్యక్రమాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈఏపథ్యంలో గృహాల్లో విద్యుత్ సామర్థ్యం గల ఉపకరణాల వాడకం, అనవసర వినియోగం తగ్గించడం వంటి అలవాట్లు ప్రోత్సహించాలి. ఇళ్లలో ఇన్సులేషన్, ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్లు వంటి చర్యలు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులను బట్టి పరిమితులను సర్దుబాటు చేయడం లేదా అదనపు మద్దతు ఇవ్వడం గురించి ఆలోచించాలి. మొత్తంమీద, ఎల్‌నినో సంక్షేమ పథకాలను ప్రభావితం చేస్తోంది. ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు, ప్రజలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవడం ద్వారా మాత్రమే






అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# ఆట






## ఇంగ్లాండ్‌ను మట్టికరిపించిన అర్జెంటీనా

ఫిఫా ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో అర్జెంటీనా అద్భుతం చేసింది. ఓటమి అంచుల్లో నిలిచిన దశ నుంచి ఊహించని రీతిలో పుంజుకుని, చివరి ఏడు నిమిషాల్లో రెండు గోల్స్ కొట్టి ఇంగ్లాండ్‌పై 2–1 తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో అర్జెంటీనా బ్లాక్‌బస్టర్ విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లగా.. సుదీర్ఘకాలం తర్వాత వరల్డ్ కప్ ఫైనల్ చేరాలనే ఇంగ్లాండ్ కల మరోసారి చెదిరిపోయింది. ఫైనల్లో అర్జెంటీనా, స్పెయిన్ తలపడనున్నాయి. మ్యాచ్ తొలి సగభాగంలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి హాఫ్‌లోనే ఏకంగా 19 ఫౌల్స్ నమోదయ్యాయంటే మ్యాచ్ ఎంత ఉత్కంఠగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, మ్యాచ్ 55వ నిమిషంలో ఇంగ్లాండ్ ఆటగాడు ఆంథోనీ గోర్డాన్ అద్భుత గోల్‌తో జట్టుకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. మోర్గాన్ రోజర్స్ కుడి వైపు నుండి అందించిన సూపర్ క్రాస్‌ను గోర్డాన్ గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ పూర్తి నియంత్రణలో ఉన్నట్లు కనిపించింది. అర్జెంటీనా దాడులను ఇంగ్లాండ్ గోల్‌కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్ అద్భుతమైన సేవ్‌లతో అడ్డుకున్నాడు. మ్యాచ్ ముగియడానికి కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉన్న దశలో అర్జెంటీనా ఆట స్వరూపాన్నే మార్చేసింది. 85వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ డి బాక్స్ వెలుపల నుండి కొట్టిన సంచలన లాంగ్–రేంజ్ షాట్ నేరుగా గోల్ పోస్ట్‌లోకి దూసుకెళ్లి స్కోరును 1–1తో సమం చేసింది. దీంతో ఇంగ్లాండ్ ఒక్కసారిగా ఒత్తిడిలో పడిపోయింది. ఇక 92వ నిమిషంలో (ఇంజ్యురీ టైమ్) లియోనెల్ మెస్సీ తన మేధావితనాన్ని ప్రదర్శించాడు. మెస్సీ అందించిన క్లాసిక్ క్రాస్‌ను సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ లౌటారో మార్టినెజ్ హెడర్ ద్వారా గోల్‌గా మలిచి అర్జెంటీనాకు 2–1తో తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. ఈ గోల్‌తో అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానులు సంబరాల్లో మునిగిపోగా.. ఇంగ్లాండ్ ఆటగాళ్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతటా గట్టి మార్కింగ్‌లో ఉన్నప్పటికీ, కెప్టెన్ మెస్సీ రెండు అసిస్ట్‌లతో (గోల్స్ చేయడంలో సహకారం) అర్జెంటీనాను ఒంటిచేత్తో ఫైనల్‌కు నడిపించాడు.



## వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7

### టీ20 ప్రపంచకప్‌లో సూపర్–8కు బదులు సూపర్–10

### వన్డే, టి20 ప్రపంచకప్‌లలో కీలక మార్పులు

### వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ నుంచి అమలు

రాబోయే ఐసీసీ టోర్నీల ఫార్మాట్లలో కీలక మార్పులు చూడబోతున్నాం. 2027 వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్–7 దశ జరగనుంది. 2028 టీ20 ప్రపంచకప్‌లో సూపర్–8కు బదులు సూపర్–10 నిర్వహించనున్నారు. టోర్నీలపై ఆసక్తిని జట్ల మధ్య పోటీని పెంచేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని ఐసీసీ తెలిపింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 10 జట్లు పోటీపడగా.. వచ్చే ఏడాది 14 జట్లు తలపడనున్నాయి. 10 జట్లు నేరుగా టోర్నీకి అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్స్ ద్వారా మరో నాలుగు జట్లు ఎంపికవుతాయి. 11వ స్థానంతో ప్రపంచకప్‌నకు వచ్చే జట్టు.. నేరుగా గ్రూప్ దశలో తలపడుతుంది. 12, 13, 14వ స్థానాలతో టోర్నీకి అర్హత సాధించిన జట్లు గ్రూప్ దశకు ముందు 'సూపర్ సిరీస్' రౌండ్ ఆడతాయి. ఇందులో అగ్రస్థానం దక్కించుకున్న టీమ్ గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది. గ్రూప్ దశలో 12 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి 3 జట్లు, మొత్తంగా నాలుగో ఉత్తమ టీమ్ సూపర్–7 దశకు చేరుకుంటాయి. అక్కడ రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడి టాప్–4లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. సంయుక్త ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా ప్రపంచకప్‌నకు అర్హత పొందుతాయి. నమీబియా అసోసియేట్ దేశం కావడంతో అర్హత టోర్నీ ఆడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే కాకుండా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 8 ఉత్తమ జట్లు టోర్నీకి అర్హత పొందుతాయి. టీ20 ప్రపంచకప్‌లో సూపర్–8 విధానానికి బదులు సూపర్–10ను ప్రవేశపెట్టింది ఐసీసీ. మొదట 20 జట్లను అయిదు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి రెండు టీమ్‌లు సూపర్–10 దశకు చేరుకుంటాయి. ఇక్కడ అయిదేసి జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు నేరుగా సెమీస్‌కు చేరుతాయి. మిగతా రెండు బెర్తుల కోసం 2వ స్థానంలో ఉన్న జట్లు ప్రత్యర్థి గ్రూప్‌లోని మూడో స్థానంలో ఉన్న టీమ్‌లను ఢీకొంటాయి. ఇందులో గెలిచిన జట్లు సెమీస్ చేరుకుంటాయి. 2028లో జరిగే టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

# ఆపరేషన్ 'షాడో హంట్' సక్సెస్..

## 3 లక్షల రూపాయల నూజ అందజేసిన జగిత్యాల. ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల ప్రతినిధి :: అర్జున్ సమాచారం జులై 18::**

జగిత్యాల పట్టణ 49వ వార్డు కు చెందిన లవంగ లింగం ఊపిరి తిత్తుల సమస్య తో బాధపడుతూ చికిత్స చేసుకునే ఆర్థిక స్తోమత లేక బాధపడుతూ ఉండగా స్థానిక నాయకులు పోతునుక మహేష్ ఎమ్మెల్యే దృష్టికి లింగం అనారోగ్యం విషయాన్నీ తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి ద్వారా 3లక్షల నూజ నీ లింగం కొడుకు నాగరాజు, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో అందజేశారు. వెంట ఐజజ అధ్యక్షులు గజంగి నందయ్య, నాయకులు లవంగ గంగాధర్ ,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## 20న ప్రజావాణి నిలిపివేత

**అర్జున్ సమాచారం జులై 18**

**మంచిర్యాల ప్రతినిధి:**



మంచిర్యాల, జూలై 18:ఈ నెల 20వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఉట్నూర్‌లోని పి.ఎం.ఆర్.సి. సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా మంత్రి, రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 20న రద్దు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## ప్రతి విద్యార్థికి మెరుగైన సౌకర్యాలే లక్ష్యం: గడ్డం వంశీకృష్ణ.




**అర్జున్ సమాచారం జులై 18 మంచిర్యాల ప్రతినిధి:**

మంచిర్యాల, జూలై 18:ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు.శనివారం దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విశాఖ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేసిన పాఠశాల సంచులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్యతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 150 మంది విద్యార్థులకు పాఠశాల సంచులు అందించే కార్యక్రమం చేపట్టామని, తొలి విడతలో 110 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులకు త్వరలోనే అందజేస్తామని చెప్పారు.విద్యార్థులు నేలపై కూర్చోకుండా ఉండేలా అవసరమైన బెంచీలను ట్రస్ట్ సహకారంతో సమకూర్చే చర్యలు చేపడతామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తోందని పేర్కొన్నారు.పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించే దిశగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాకొద్దీ నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్ చార్జి!

**బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే ఆవుల రాజిరెడ్డి ప్రాధాన్యత**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు శివంపేట నేతల ఫిర్యాదు**

కష్టపడి పోరాటాలు చేసి పార్టీని అధికారంలోకి తీసుకొస్తే.. నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్ చార్జి ఆవుల రాజిరెడ్డి తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని మెదక్ జిల్లా శివంపేట మండల కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వ్యవహార శైలికి నిరసనగా నాయకులు గాంధీభవన్‌కు తరలివచ్చారు. మండల అధ్యక్షుడు కొడకంచి సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను స్వయంగా కలిసి నియోజకవర్గంలోని పరిస్థితిని వివరించారు. ఇన్ చార్జిని మార్చాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ, పార్టీ కోసం ఎంతోకాలంగా కష్టపడి పని చేస్తున్న సీనియర్ నాయకులను ఇన్ చార్జి రాజిరెడ్డి పూర్తిగా పక్కన పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికే ఆయన అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కార్యక్రమాల విషయంలో కనీసం మండల అధ్యక్షులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




నల్లగొండ జిల్లా పోలీసుల వ్యూహాత్మక దర్యాప్తు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పకడ్బందీ నిఘాతో చేపట్టిన ఆపరేషన్ 'షాడో హంట్' విజయవంతమైంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు భూష్మి శ్రీకాంత్‌తో పాటు అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాకు చెందిన మొత్తం ఆరుగురు సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మెరుపు ఆపరేషన్ ద్వారా ఏకంగా 40 చోరీ కేసులను ఛేదించి, నిందితుల నుంచి రూ. 53 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు.పోలీసుల కథనం ప్రకారం.. ప్రధాన నిందితుడు శ్రీకాంత్ పోలీసుల కళ్లుగప్పి రాష్ట్రాలు మారుస్తూ తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. వైన్ షాపుల వద్ద పరిచయమైన యువకులకు మద్యం, డబ్బు ఆశ చూపి వారితో స్నేహం పెంచుకునేవాడు. తక్కువ సమయంలో అధిక డబ్బు సంపాదించాలంటే చోరీలే ఏకైక మార్గమంటూ వారిని ప్రలోభపెట్టి నేరాల బాట పట్టించేవాడు. తాళాలు ఎలా పగులగొట్టాలి, సీసీ కెమెరాలకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలి, ఏ ఇళ్లను టార్గెట్ చేయాలి, చోరీ చేసిన సొత్తును ఎక్కడ, ఎలా విక్రయించాలి తదితర అంశాలపై యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పక్కా ప్రొఫెషనల్ ముఠాగా తీర్చిదిద్దినట్లు విచారణలో వెల్లడైంది.ఈ ముఠా ఆగడాలకు చెక్ పెట్టేందుకు మూడు ప్రత్యేక పోలీసు బృందాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రోజుల తరబడి రహస్య నిఘా పెట్టాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన 12 నేర ఘటనల్లో లభించిన వేలిముద్రలు నిందితుల వేలిముద్రలతో సరిపోలడం, సీసీటీవీ ఫుటేజీలు కీలకంగా మారడంతో కేసు దర్యాప్తు వేగవంతమైంది. పక్కా సమాచారంతో పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ. 53 లక్షల విలువ చేసే 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి, రూ. 1.50 లక్షల నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. నేరస్థులు ఎంత తెలివిగా ప్రణాళికలు రచించినా నల్గొండ పోలీసుల సాంకేతిక దర్యాప్తు, సమన్వయం ముందు వారు తప్పించుకోవడం అసాధ్యమని హెచ్చరించారు. ఈ కేసును అత్యంత సమర్థవంతంగా ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎం. జితేందర్ రెడ్డి, డి. చంద్రశేఖర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.ఎన్.డి. ప్రసాద్, నిడుమనూరు ఎస్ఐ విజయకుమార్, సీసీఎస్ ఎస్ఐ యూ. సురేశ్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభకు గుర్తింపుగా నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

## వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ. 900 కోట్లు: మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు

వికారాబాద్ జిల్లాలో రహదారుల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, జిల్లా రోడ్ల అభివృద్ధికి ఏకంగా రూ. 900 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తాండూరు నియోజకవర్గంలో రూ. 290 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ, పటిష్టీకరణ పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బుయ్యని మనోహర్ రెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ దీపక్ తివారీలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం కందనెల్లి జెపిఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, మెరుగైన రహదారుల ద్వారానే పరిశ్రమలు, వ్యాపారాలు వృద్ధి చెంది స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నామని, మంజూరైన పనులను త్వరితగతిన ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలనలో భాగంగా గడిచిన 30 మాసాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం, రూ. 500లకే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని గుర్తు చేశారు. మహిళా సంఘాలకు రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, రైతు భరోసా కింద




కేవలం 9 రోజుల్లోనే రూ. 900 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు యంగ్ ఇండియా పాఠశాలలు స్థాపిస్తున్నామని తెలిపారు. కోర్టు వివాదం పరిష్కారం కాగానే రూ. 94 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులను 18 వారాల్లో పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రవాణా వ్యవస్థ మెరుగుపడితేనే అభివృద్ధి సాధ్యమని, ఇందులో భాగంగానే రూ. 261 కోట్లతో ప్రధాన రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కాగ్నా నదిలో మురుగునీరు కలవకుండా రూ. 30 కోట్లు మంజూరు చేసి ప్రక్షాళన పనులు ప్రారంభించామన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని, గ్రూప్-1, గ్రూప్-2 తదితర పరీక్షల ద్వారా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. తాండూరు మున్సిపాలిటీ పరిధిలో 571 మంది అర్హులకు పారదర్శకంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించామని తెలిపారు. అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి ఇస్తే వెంటనే అనుమతులు మంజూరు చేస్తామని స్థానిక అధికారులకు హామీ ఇచ్చారు.శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల రోడ్ల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. కర్ణాటక సరిహద్దు రోడ్లను సైతం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, తాండూరు అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో అత్యధిక నిధులు రాబడుతున్నామన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం రూ. 75 కోట్లతో ఏటీసీని ఏర్పాటు చేసి గత ఏడాది 165 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. బషీరాబాద్ రోడ్ల అభివృద్ధితో పాటు 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాలను మంజూరు చేయించామని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్ (స్థానిక సంస్థలు), ఇ.వెంకటాచారి (రెవెన్యూ), అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఆర్డీఓ అనిత, ఆర్ అండ్ బి ఎస్ఈ వసంత నాయక్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కందనెల్లి సర్పంచ్ యాదమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల రాజకీయ సాధికారత దిశగా చారిత్రాత్మక అడుగు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమమే కాకుండా రాజకీయ సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఎస్సీ, గిరిజన, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల్లో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్టెడ్ సభ్యులుగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం సమ్మిళిత పాలన, సామాజిక న్యాయానికి దర్పణం పడుతుందన్నారు. రాజ్యాంగ విలువల పట్ల, ట్రాన్స్‌జెండర్ల గౌరవం, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ నిర్ణయం ఒక గొప్ప నిదర్శనమని ఆయన వర్ణించారు.ట్రాన్స్‌జెండర్లకు కేవలం సంక్షేమ పథకాలు అందించడానికే పరిమితం కాకుండా పాలనలో వారిని క్రియాశీల భాగస్వాములను చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి స్పష్టం చేశారు.



స్థానిక సంస్థల్లో వారిని కో-ఆప్టెడ్ సభ్యులుగా చేర్చడం ద్వారా గ్రామాలు, మండలాలు, పట్టణ స్థానిక సంస్థల అభివృద్ధిలో వారి గొంతుకకు ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. ప్రజా పరిపాలన, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో వారికి భాగస్వామ్యం కల్పించే ఈ తాజా నిర్ణయం దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పలు కార్యక్రమాలను ప్రారంభించిందని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. డ్రైవింగ్, వంట, డ్రోన్ ఆపరేషన్లలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు, హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో ఉపాధి అవకాశాలు, ట్రాఫిక్ నిర్వహణలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని చూపిస్తున్నామని వివరించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది తమకు ఎంతో గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి, స్థానిక పాలనకు బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రికి, అండగా నిలుస్తున్న మంత్రికి వారు కృతజ్ఞతలు తెలుపుతూ సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ ఉమెన్ హక్కుల కార్యకర్తలు, ట్రాన్స్ మెన్ హక్కుల కార్యకర్తలు, హిజ్రా కమ్యూనిటీ నాయకులు, వివిధ ట్రాన్స్‌జెండర్ సంఘాల ప్రతినిధులతో సహా సుమారు 25 మంది ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ నినో పొంచి ఉంది.. ఆరుతడి పంటలే మేలు: మంత్రి పొంగులేటి

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు సంప్రదాయ సాగుపై మొండిపట్టు వీడి, ప్రత్యామ్నాయ మెట్ట (ఆరుతడి) పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రజా ప్రభుత్వం రైతులు, పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే రైతు భరోసా కింద ఇప్పటికే ఎకరాకు రూ. 6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర్‌తో కలిసి మంత్రి విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి, అలాగే కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో వేయనున్న బీటీ రోడ్డు, అగ్రహారంలో రూ. 20 లక్షల పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని పంపిణీ చేశారు. మండల పరిధిలోని 66 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, అలాగే వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 111 మందికి రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పొంగులేటి అందజేశారు.



## ఎల్లమ్మ కళ్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు...

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ (అర్జున్ సమాచారం, ప్రతినిధి. జులై 18)

ఈ నెల 21 వ బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, 22 వ తేదీన రథోత్సవం జరగనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడించారు. ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆలయం వద్ద అయన సమీక్ష నిర్వహించారు. లక్షలాది గా వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు, ప్రశాంత వాతావరణంలో అమ్మవారి కళ్యాణం జరిగేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు, ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రత్యేక అదనపు సిబ్బంది నియామకం, అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తోపులాట కు గురికాకుండా భారికేడ్ ల ఏర్పాటు చేసామని అన్నారు. 2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత బల్కంపేట ఆలయం ఎంతో అభివృద్ధి చేశాం. నాడు అమ్మవారి కళ్యాణానికి 20 వేల మంది వస్తే ఇప్పుడు 7 నుండి 8 లక్షల మంది వరకు భక్తులు వస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య వారానికి లక్ష దాటుతుందని అయన అన్నారు.

## కరోనా లక్షణాలతో ఏపీలో బాలిక మృతి



కాకినాడ(అర్జున్ సమాచారం ప్రతినిధి. జులై 18)

గొల్లప్రోలుకు చెందిన 16 ఏళ్ల బాలిక చెన్నైలో కోవిడ్ లక్షణాలతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీర్ఘకాలిక అనారోగ్యంతో కాకినాడ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఆమెను మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించగా కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. బాలిక మరణంతో స్థానికంగా కలకలం రేగింది. వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి మృతురాలి కుటుంబ సభ్యులకు కోవిడ్ పరీక్షలు నిర్వహించారు.

## గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీకి ఘన సన్మానం



,ఆసిఫాబాద్, జూలై 18(అర్జున్ సమాచారం ప్రతినిధి )

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు నూతనంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీని టీఎస్టి బ్ల్యూటీయూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఎం ఆర్ సి ఏ సి ఎం ఓ పూర్కా ఉద్దవ్, జి సి డి ఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడా అధికారి మడావి శేఖు, ఏ టి డి ఓలు చిరంజీవి, భాస్కర్, టీఎస్టి బ్ల్యూటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నైతం కృష్ణ రావ్, సంఘం అధ్యక్షులు కొట్నాక్ యాదవరావ్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మడావి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడెం రవీందర్, కూద్మేత అనంత్, వెద్మ యశ్వంత్ రావ్, మడావి పోచాని, షెడ్మాకీ వెంకటేష్, బండ మీనారెడ్డి, చాకిలం మధు, చంద్రశేఖర్ పవార్ లింబారావ్, కూద్మేత జంగు, నందారాం, మడావి లచ్చు తో పాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన.. ఏఈఓ రాకేష్

మంచిర్యాల జిల్లా(అర్జున్ సమాచారం ప్రతినిధి. జులై 18

)తాండూర్ మండలం కిష్టంపేట క్లస్టర్ పరిధిలోని కాసిపేట్ గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావం, పంట వైవిధ్యం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ రాకేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటలకు బదులుగా కంది, పెసర, మినుము, శెనగ, జొన్న వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించడంతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా, పంట రుణాలు, విత్తన సబ్సిడీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో పంటల వైవిధ్యమే సమర్థవంతమైన మార్గమని, దీనివల్ల రైతుల నష్టాలు తగ్గి ఆదాయం స్థిరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొని పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అధికారుల నుంచి సూచనలు, సలహాలు



# నాగారం గ్రామంలో సర్వే ప్రక్రియ పూర్తి

### సర్వే విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్‌కు సర్పంచ్ ఘన సన్మానం



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 18:

కొమురం భీం జిల్లా కమాన్‌పూర్ మండలంలోని నాగారం గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల సర్వే (ఎస్ఐఆర్) ప్రక్రియ విజయవంతంగా పూర్తైంది. నాగారం పోలింగ్ బూత్ నంబర్–-57 పరిధిలో మొత్తం 896 మంది ఓటర్లు ఉండగా, 834 మంది వివరాలను డిజిటలైజేషన్ చేశారు. మిగిలిన 62 మందిలో 18 మంది మరణించగా, 14 మందికి డబుల్ ఓట్లు ఉన్నట్లు, 32 మంది ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించారు. అలాగే లింగాల పోలింగ్ బూత్ నంబర్--58 పరిధిలో మొత్తం 646 మంది ఓటర్లలో 598 మంది వివరాలను డిజిటలైజేషన్ చేశారు. మిగిలిన 48 మందిలో 10 మంది మరణించినట్లు, 6 మందికి డబుల్ ఓట్లు ఉన్నట్లు, 32 మంది ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించారు. సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్‌వో సూపర్‌వైజర్ డి. సతీష్ కుమార్, బీఎల్‌వోలు దొంత అమల, బూస రేణుకలను గ్రామ సర్పంచ్ పొనగంటి కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు వోడ్నాల శ్రీనివాస్, సాగి శ్రీధర్ రావు, పెండ్లి నారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి అల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# శాలపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం: సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 18:

కొమురం భీం జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్ధిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాలపల్లిలో ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్, ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్ శనివారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సిద్ధిపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. శాలపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, వార్డు సభ్యులు బిల్లా వెంకటేష్, మోర అనూష ప్రశాంత్, కొలిపాక వెంకన్న, కాంగ్రెస్ నాయకులు చిప్ప రాజకుమార్, నరేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా సుందరం ఫౌండేషన్

### బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేసిన బోనాల వెంకటస్వామి




పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 18:

కొమురం భీం జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామపంచాయతీ పరిధిలోని పలు బాధిత కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. రొంపికుంట గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీలత అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న బోనాల వెంకటస్వామి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే రొంపికుంట గ్రామపంచాయతీ పరిధిలోని మహారాజు కాలనీలో నివసించే పేద కుటుంబానికి చెందిన పులిపాక సది అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు రూ. 1,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని బోనాల వెంకటస్వామి పేర్కొన్నారు. అవసరంలో ఉన్న వారికి సుందరం ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొంపికుంట గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు కావేటి గోపాల కిషన్, చెన్నోజు చంద్రశేఖర్, దండె తిరుపతి, వార్డు సభ్యులు పులిపాక సాంబయ్య, కొండి అనిల్, కుందారపు రమేష్, గన్నవరపు నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఘనంగా గోరింటాకు పండుగ

### ఆషాఢ మాసంలో గోరింటాకు సంప్రదాయాన్ని చిన్నారులకు పరిచయం చేసిన పాఠశాల యాజమాన్యం


పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 18:

కొమురం భీం జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో శనివారం గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, మహిళలు ముందుగా గోరింటాకు చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గోరింటాకును రుబ్బి చిన్నారుల చేతులకు పెట్టారు. గోరింటాకు ఎర్రటి రంగులోకి మారడంతో చిన్నారులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయంలో భాగమని తెలిపారు. చిన్నారులు కూడా గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలోని వేడి తగ్గుతుందని, ఆరోగ్యానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే గోరింటాకు పెట్టుకోవడం వల్ల నరాల అలసట తగ్గుతుందని, ఇంటి ముందు గోరింటాకు చెట్టు ఉండడం శుభప్రదమని, లక్ష్మీప్రదంగా భావిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయినులు చామంతి, నాగరాణి, శారద, ప్రియాంక, సుప్రజ, అర్చనతో పాటు మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA





# ఈసారి కథ మారింది!

అగ్ర హీరో రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. దాదాపు గత ఏడాదిగా ఈ సినిమాపైనే దృష్టి పెట్టారు రామ్‌చరణ్. 'పెద్ది' హంగామా ముగియడంతో సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయబోయే తదుపరి సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా లాంచింగ్ డేట్, ఇది ఏ జోనర్ కథాంశమనే విషయాలపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్‌ను దర్శకుడు సుకుమార్ లాక్ చేశారని సమాచారం. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది'రంగస్థలం' తరహా రూరల్ డ్రామా కాదని, రామ్‌చరణ్ కోసం దర్శకుడు సుకుమార్ ఈసారి సరికొత్త కథను సిద్ధం చేశారని, నగర నేపథ్యంలో స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందనుంది.





# రాకా కోసం దీపిక సాహసం?



ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం. అంతేకాదు, తన 'ఎనిమిది గంటల పని' నిబంధనను కూడా ఈ సినిమా విషయంలో ఆమె పక్కన పెట్టారని తెలిసింది. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందు, 'రాకా'లో తన పార్ట్ షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని ఆమె నిర్ణయించారట. అటు షూట్‌లో పాల్గొంటూనే ఇటు తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటూ, లొకేషన్‌లో నటిగా, తల్లిగా రెండు బాధ్యతలనూ నిర్వర్తిస్తూ అందరి దృష్టినీ దీపిక ఆకర్షించారట. దీపిక తన జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకునే తీరును చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిస్తున్నారు

# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?



'కేజీఎఫ్'తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. 'హను-మాన్' విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో 'జై హనుమాన్'ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.

# ఇంగ్లిష్ రాదని ఆటపట్టించేవారు!

తన పాఠశాల రోజుల గురించి కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. ఇంగ్లిష్ రాకపోవడంతో అందరూ తనను ఆటపట్టించేవారని, నాటి అవమానాలను సవాలుగా తీసుకొని చదువుల్లో రాణించానని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ కాలేజీ విద్యార్థులతో జరిపిన ముఖాముఖిలో ఆమె ఈ సంగతుల్ని వెల్లడించింది. 'మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో నా బాల్యం గడిచింది. అక్కడే మరాఠీ మీడియం స్కూల్‌లో చదువుకున్నా. కొన్నాళ్ల తర్వాత నాన్న ఉద్యోగరీత్యా మా కుటుంబమంతా నైజీరియాకు షిఫ్ట్ అయ్యాం. అక్కడ ఇంగ్లిష్ మీడియం కావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. నాకేమో మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియదు. ఇంగ్లిష్ రాదని స్కూల్లో అందరూ హేళన చేసేవారు. జోక్స్ వేస్తూ ఆటపట్టించేవారు. అయినా నేను ఏ మాత్రం కుంగిపోలేదు. అవహేళనలను ఛాలెంజ్‌గా స్వీకరించా. కొద్దిరోజుల్లోనే ఇంగ్లిష్‌పై పట్టుసాధించాను. ఆ తర్వాత కొన్నాళ్లకు ఇంగ్లీష్‌లో అనర్గళంగా ప్రసంగించే స్థాయికి చేరుకున్నా. పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవొచ్చని నా స్కూల్ డేస్‌లోనే అర్థమైంది' అని చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఈ భామ 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకుంది.

# సకుటుంబ కథా చిత్రం

స్వీయ దర్శకనిర్మాణంలో ఎన్.ఎన్.ఆర్.చౌదరి హీరోగా నటించిన 'నేను నా లల్లీ' చిత్రం త్వరలో విడుదల కానుంది. కథానాయిక తస్లీమ్ పుట్టినరోజు సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకనిర్మాత ఎన్.ఎన్.ఆర్.చౌదరి చిత్ర విశేషాలు తెలియజేశారు. భావోద్వేగభరితంగా సాగే కుటుంబ కథా చిత్రమిదని, సంగీతానికి కూడా చాలా ప్రాధాన్యత ఉంటుందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాసాచార్య, కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం: ఎన్.ఎన్.ఆర్.చౌదరి.





# ప్రజాకవి అందెశ్రీ ఆశయాలు విద్యార్థులకు ఆదర్శం

ఇందారం పాఠశాలలో జయంతి వేడుకలు.




**అర్జున్ సమాచారం జులై 18 మంచిర్యాల ప్రతినిధి:**

జైపూర్: మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ గేయ రచయిత, ప్రజాకవి అందెశ్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కె. రమేష్ బాబు మాట్లాడుతూ ప్రజాకవి అందెశ్రీ సాహిత్యం సమాజంలో చైతన్యాన్ని నింపిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన రచించిన గేయాలు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని కోరారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. మంజుల, ఎం. విజయలక్ష్మి, ఎం. సత్తిరెడ్డి, జి. చక్రధర్, డి. సహదేవ్, జి. సంధ్యారాణి, ఎన్. పద్మ, జి. రవీందర్, బి. నవీన్ కుమార్, పాల్గొన్నారు.

# గూడెంలో కాంగ్రెస్ కలహం.. పార్లమెంట్ సభ్యుడి రాకతో రాజకీయ వేడి!

## గూడెంలో స్వాగత ఏర్పాట్లపై రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత..





**దండేపల్లి:**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు వెలుగుచూశాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల సంచుల పంపిణీ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు వంశీకృష్ణ హాజరుకానున్న నేపథ్యంలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్లమెంట్ సభ్యుడికి స్వాగతంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు చించివేసినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. ఈ ఘటన సమయంలో శాసనసభ్యుడు ప్రేమ్‌సాగర్ రావుకు అనుకూలంగా కొందరు నినాదాలు చేసినట్లు సమాచారం. పార్లమెంట్ సభ్యుడికి స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రెండు వర్గాల నాయకులు, కార్యకర్తలు ఒకేచోట చేరడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో గూడెం గ్రామంలో రాజకీయ చర్చ జోరందుకుంది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

# 8 విల్లాలో అర్ధరాత్రి హంగామా

**మేడ్చల్(అర్జున్ సమాచారం ప్రతినిధి )జులై 18**

పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక అలమైసన్ గేటెడ్ కమ్యూనిటీ (విల్లాస్ )లో అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు హంగామా సృష్టించారు. తమ విల్లాస్ లో గల పార్కు స్థలంలో ఉన్న బోరుబావి ని రిపేర్ చేస్తున్న క్రమంలో మైనంపల్లి చందర్ రావు మరికొంత మంది కలసి పార్క్ స్థలం తమదని అందులో ఎలాంటి యాక్టివిటీ వేయొద్దు అంటూ ...విల్లాస్ లో ఉండే వారిపై దాడి కి పాల్పడ్డారు. గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న సెక్యూరిటీని సైతం బెదిరించి బైట కొందరి రౌడీ మూకలతో వచ్చి భయభ్రాంతులకు గురిచేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు,ఆడవారు అనే కనీసం మర్యాద లేకుండా ప్రవర్తించారని,ప్రశాంతంగా ఉండటం కోసం విల్లాస్ ను కొనుగోలు చేసి,జీవిస్తుంటే ఇలా తమపై దాడికి పాల్పడటం దారుణమని అన్నారు. ఈ విషయం పై పోలీసులకి సమాచారం అందడంతో అక్కడ సెక్యూరిటీ గార్డుల పై,స్థానికుల పై దాడి కి యత్నించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయం పై తమకు భద్రత పరమైన ఇబ్బందులు ఉన్నాయని,పోలీసు అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఎంపీపీఎస్ ఖాజీపల్లి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ డొనేషన్ చేసిన జాగటి నాగరాజు





**భీమారం (మంచిర్యాల), అర్జున్ సమాచారం, జూలై ,18**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ఖాజీపల్లి లో విద్యార్థుల త్రాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ప్రముఖ దాత జాగటి నాగరాజు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. పాఠశాలలో సరైన త్రాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రోజంతా దాహం తీర్చుకోవడానికి ఇళ్ల నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జాగటి నాగరాజు గమనించారు. స్పందించిన ఆయన తక్షణమే తన స్వంత ఖర్చులతో రూ. వేల విలువైన 'కెన్ స్టార్' కంపెనీకి చెందిన అత్యాధునిక వాటర్ ఫిల్టర్‌ను కొనుగోలు చేసి, పాఠశాలలో ఉచితంగా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సభలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం నాగరాజుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆయన చేసిన సామాజిక సేవను గుర్తిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

# జైపూర్ ఎస్టీపీ ప్లాంట్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

## తనిఖీల్లో 41 వాహనాలు సీజ్.. ఇతర రాష్ట్రాల కార్మికులకు పోలీసుల అవగాహన

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 17:**





రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జైపూర్ ఎస్టీపీ ప్లాంట్ లేబర్ క్యాంపులో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జైపూర్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎస్ఐ భూమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికుల నివాస ప్రాంతాల్లోని బ్యారక్‌లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 22 మోటార్‌సైకిళ్లు, 6 మినీ బస్సులు, 9 ట్రాలీ వాహనాలు, 4 ఆటోరిక్షాలను కలిపి మొత్తం 41 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.కార్యక్రమానికి జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హాజరై ప్లాంట్‌లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులతో సమావేశమయ్యారు. ఉపాధి కోసం వచ్చిన కార్మికులు తమ స్వగ్రామ పోలీస్ స్టేషన్ నుంచి ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని తెలిపే నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌ఓసీ) తీసుకుని వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని సూచించారు. కార్మికులు నివసించే బ్యారక్‌ల పరిసరాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్లాంట్ యాజమాన్యానికి సూచించారు.ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి కొనుగోలు, విక్రయం, రవాణా, వినియోగం వంటి కార్యకలాపాల్లో పాల్గొంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల కార్మికులు స్థానిక చట్టాలను గౌరవిస్తూ ప్రశాంతంగా జీవించాలని, ఆధార్, గుర్తింపు కార్డులు వంటి ధ్రువీకరణ పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను ప్లాంట్ యాజమాన్యం వద్ద నమోదు చేయించుకోవాలని, గొడవలు, మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. మోసపూరిత కాల్స్ లేదా సందేశాలు వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల భద్రత, నేరాల నివారణ కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.

# విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ టెస్టుల గందరగోళం.. రోగుల అవస్థలు....

**కోవిడ్ లక్షణాలతో విజయవాడ (అర్జున్ సమాచారం. ప్రతినిధి జులై 18)**

ప్రభుత్వాసుపత్రికి వచ్చిన పలువురు రోగులు పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలియక ఆసుపత్రి ప్రాంగణమంతా తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవిడ్ టెస్టింగ్ కేంద్రంపై స్పష్టమైన సూచిక బోర్డులు లేకపోవడంతో రోగులు అయోమయానికి గురవుతున్నారు. ఆసుపత్రిలో "ఫోన్ ఉంటేనే ఓపీ" అనే బోర్డులు కనిపిస్తుండగా, కోవిడ్ పరీక్షల కోసం ఎక్కడికి వెళ్లాలనే విషయంపై మాత్రం ఎలాంటి స్పష్టత లేకపోవడంపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిన్న సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఐసోలేషన్ ఏర్పాటు చేసి, కోవిడ్ లక్షణాలతో వచ్చే వారికి పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, ఈరోజు మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపించిందని రోగులు ఆరోపిస్తున్నారు. టెస్టింగ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పలువురు ఆసుపత్రి మొత్తం వెతికినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. కోవిడ్ వంటి అంటువ్యాధి విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న తరుణంలో, ప్రభుత్వాసుపత్రిలోనే టెస్టింగ్ ప్రక్రియపై స్పష్టత లేకపోవడం, సిబ్బంది అందుబాటులో లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, కోవిడ్ పరీక్షల నిర్వహణను సక్రమంగా ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.



# యువతీ యువకుడు ఆత్మహత్య

**నల్గొండ(అర్జున్ సమాచారం ప్రతినిధి. జులై 18)**

నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం మునుకుంట్లలో అనుమానాస్పద రీతిలో యువతి మృతి చెందింది. మృతురాలు లక్ష్మీ ప్రసన్న ఉరికి వేలాడుతూ కనిపించింది. ప్రసన్న మృతిపై గ్రామానికి చెందిన ఓ యువకుడిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తోన్నారు. ప్రసన్న కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసిన యువకుడు కూడా శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చరణ్ తాటి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరూ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నట్లు సమాచారం. ప్రసన్నసూర్యాపేటలోన్త్ర ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. ఇద్దరి మృతి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. .



Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.